క్లుప్తంగా

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా వెంకన్న



వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న సంఘం డైరెక్టర్లు

గుర్రంపోడు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) గుర్రంపోడు, వైస్ చైర్మన్‌గా పామనగుండ్ల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఎన్నికల అధికారి మురళిచారి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. డైరెక్టరంతా ఏకగ్రీవానికి అంగీకరించడంతో పామనగుండ్ల వెంకన్నను వైస్ చైర్మన్‌గా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చనమల్ల యాదవరెడ్డి, సీఈఓ సాయికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

దేవరకొండ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వందేళ్ల అవుతున్న నేపథ్యంలో డిసెంబర్ 30న నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ లోని పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో నిర్వహించిన సీపీఐ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొడ్డుపల్లి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, పల్లె నరసింహ, ఎండీ మైనొద్దీన్, తూం బుచ్చిరెడ్డి, కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, జయరాములు, వెంకటేశ్వరరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బస్సులు నిలుపుదల

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ బస్‌స్టేషన్‌లో సీసీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నుంచి 15రోజులపాటు మాల్ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లవని డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ రోడ్డుపైన మాత్రమే బస్సులు నిలపనున్నట్లు పేర్కొన్నారు. మాల్ బస్టాండ్ పరిధిలోని ప్రయాణికులు గమనించి ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

జిల్లా ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సన్మానం

పెద్దవూర : జాతీయ ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు జిల్లాలోనే అత్యధిక పనిదినాలు కల్పించిన మండలంలోని పొట్టివానితండా ఫీల్డ్ అసిస్టెంట్ రమావత్ రాంబాబును మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నల్లగొండలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబును శాలువాతో సత్కరించి, సర్టిఫికేట్‌తో పాటు జ్ఞాపికను అందించారు. దివ్యాంగులను సైతం అందరితో సమానంగా చూడాలన్నారు.

ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

చింతపల్లి : మండలపరిధిలోని కుర్మపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి ఎమ్మెల్యే బాలుకునాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు ఆడుకునే సమయంలో పశువులు, మధ్యాహ్న భోజన సమయంలో పందులు వస్తుండటంతో అవస్థలు పడుతున్నారని ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు.

బాబు రాజేంద్రప్రసాద్‌కు నివాళి

దేవరకొండ : భారతదేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంకం చంద్రమౌళి, లింగయ్య, నారాయణరెడ్డి, దామోదర్ రెడ్డి, బుచ్చయ్య, యాదగిరి, కోటయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బంద్ పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 7న ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త బంద్ ప్రచార పోస్టర్‌ను మంగళవారం పట్టణంలోని తెలంగాణ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఆటో మోటార్స్ ట్రేడ్ యూనియన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ.నాజర్ అలీ మీర్జా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామావతారం, జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వేజ్, ఆటో యూనియన్ నాయకులు భీమ్లానాయక్, నాగు, నాగరాజు, మట్టయ్య, శ్రీనివాస్, కాశయ్య, పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా

● దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ : మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.మంగళవారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. అనంతరం వివిధ మహిళా సంఘాలకు సంబంధించి రూ.51లక్షల చెక్కును ఆయన పంపిణీ చేసి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఆర్డీఓ రమణారెడ్డి, కమిషనర్ సుదర్శన్, హన్మంతు వెంకటేష్‌గౌడ్, కొండ్ర మల్లీశ్వరీ శ్రీశైలంయాదవ్, తస్కీన్ సుల్తానా, రయిస్, జయప్రకాష్, గాజుల మురళీ, తౌఫిక్, కొర్ర రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

చింతపల్లి : గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని గోడుకొండ్లలో రూ.10లక్షలతో, కుర్మపల్లి గ్రామంలో రూ.5లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి సీసీ రోడ్డు, బీటీ రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు మంజూరు చేసే విధంగా రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ముందుకువెళ్తానని తెలిపారు. అనంతరం గోడుకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. జాతీయ సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి తోళ్ల అజయ్‌కుమార్‌ను అభినందించారు. అజయ్ కుమార్ హరియాణాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ లో పాల్గొనడానికి కావాల్సిన సహకారం చింతపల్లి మండల మాజీ ఎంపీపీ భవాని పవన్ రూ.40వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ ఎంపీపీ భవాని పవన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి నాయకులు నాగభూషణం, వెంకటయ్య గౌడ్, వెంకటయ్య, హరి నాయక్, నర్సింహ, రవి నాయక్, భాస్కర్, గోవర్ధన్, ఉరే లక్ష్మన్, గోపాల్, శ్రీశైలం, శ్రీను, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అదాని అవినీతిపై నోరు మెదపని మోదీ



మాట్లాడుతున్న చెరుపల్లి, పక్కన జూలకంటి

మిర్యాలగూడ : అదాని అవినీతి అక్రమాలపై పార్లమెంట్‌లో విపక్ష సభ్యులు గగ్గోలు పెడుతున్నా ప్రధానమంత్రి మోదీ నోరు మెదపడం లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ అన్ని దేశాల్లో అదాని అవినీతికి పాల్పడిన విషయం తేలి అమెరికాలో కేసు నమోదు కాగా దేశ పార్లమెంట్‌లో అదాని అవినీతిపై చర్చ జరగాలని విపక్షాలు కోరుతున్నా మోదీ మాత్రం నోరు మెదపడంలేదన్నారు. దేశంలో రూ.50 కోట్ల నుంచి వంద కోట్ల అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపుతున్న మోదీ అదాని విషయంలో ఆ వైఖరి ఎందుకు అవలంభించడం లేదని ఆరోపించారు. అదేవిధంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మోదీ దివాళాకోరు విదానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రయోజాలను కాలరాస్తున్న బడా పెట్టుబడిదారులకు వంత పాడుతున్నారని ఆరోపించారు.

నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు



ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

త్రిపురారం : ఉపాధి నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని పీడీ నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నిడమనూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలోని 29 గ్రామ పంచాయతీలో 584 పనులకు గాను రూ. 4కోట్ల 85లక్షల పనులు నిర్వహించారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఎఫ్‌ఏ, టీఏలకు రూ. 22 వేలు జరిమానా విధించి, రూ. 24వేలు రికవరీకి ఆదేశించారు. ఏపీడీ యామిని, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, బాలకృష్ణ, గౌతమి, అంబుడ్స్ మెన్ గౌరి, వేణుగోపాల్ రావు, ఎంపీడీఓ వెంకటేశం, ఏపీఓ శ్రీనయ్య, పీఆర్ ఏఈ సాయి ప్రసాద్, వెంకన్న ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం

● హాస్టల్ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



హాస్టల్ విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : విద్యావ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో నివాసం ఉంటున్న 8వేల మంది విద్యార్థులకు ఎమ్మెల్యే సొంత ఖర్చులతో సుమారు రూ. 50లక్షల విలువ గల రగ్గులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే సాగర్ నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపడానికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో నివాసం ఉండే విద్యార్థులు చలికాలం నానా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని తన సొంత ఖర్చులతో వారికి రగ్గులను పంపిణీ చేసినట్లు తెలిపారు. హాలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తన సొంత డబ్బులు సుమారు రూ. 15లక్షల విలువ గల డ్యూయల్ బెంచీలు అందించినట్లు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ఖజానాలో నిధులు లేవని, రాష్ట్ర ప్రభుత్వం మీద భారం వేయకుండా సాగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతుల కల్పనకు పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హాలియా మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ కార్మికులకు పీపీ కిట్లను ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలికేట్ కర్నాటి లింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమ నరేందర్‌రెడ్డి, హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు చంద్రశేఖర్ రెడ్డి, అంకతి సత్యం, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కమిషనర్ రామదుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



హాలియా : దివ్యాంగులతో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



మిర్యాలగూడ అర్బన్ : భవిత కేంద్రంలో..



పెద్దఅడిశర్లపల్లి : ఎంఆర్‌సీ కార్యాలయంలో..

హాలియా : దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడారు. సాగర్ నియోజకవర్గంలోని మండలానికి ముగ్గురి చొప్పున దివ్యాంగులను ఎంపిక చేసి వారికి తన సొంత ఖర్చులతో ఒకొక్కటి రూ. 40వేల విలువగల ట్రై సైకిల్ వాహనాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలికేట్ కర్నాటి లింగారెడ్డి, పీడీ రాజ్‌కుమార్, హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు చంద్రశేఖర్ రెడ్డి, అంకతి సత్యం, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నారాయణ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, శ్రీనివాస్, ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. మంగళవారం స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే బీసీ భవనంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్‌ఐ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మెప్మా టీఎంసీ బక్కయ్య, ధనుంజయ, జాఫర్, శ్వేతారెడ్డి, తదితరులున్నారు. అలాగే మండలంలోని అవంతిపురంలోని ప్రభుత్వ బదీరుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నంద పాల్గొని మాట్లాడారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో వికలాంగుల హక్కుల దినోత్సం సందర్భంగా కేక్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకన్న కట్ చేసి పంపిణీ చేశారు. ఈ మావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త వెంకన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్‌ఖాన్, కాంగ్రెస్ స్టార్ క్యాంపెన్ చైర్మన్ పాలగాని వెంకటేష్ గౌడ్ బాలకృష్ణ ఉన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఈఓ లావూరి బాలు నాయక్ అన్నారు. మంగళవారం దివ్యాంగ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడలోని భవిత కేంద్రం వద్ద వివిధ రకాలైన దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వరుణ్, బ్రహ్మచారి, జ్యోతి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నాగేశ్వర్‌రావు కోరారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ఉదయ, స్పెషల్ ఎడ్యూకేషన్ స్కూల్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఐఈఆర్‌పీ ఎస్.త్రివేణి, పీఆర్టీయూ అధ్యక్షుడు అంజయ్య, అంజాచారి, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం అనేది లోపం కాదు

పెద్దవూర: వైకల్యం అనేది లోపం కాదని సమాజంలో అందరితో పోటీ పడవచ్చునని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికాలంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ రమేష్, సీజీవీ కవిత, శ్రీనివాస్, మహేష్, శేషు, యూన్సీ, సుదర్శన్, పరమేష్, సక్రాం, విజయ, పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటయ్య మాట్లాడారు. అనంతరం వికలాంగ ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ఎర్ర వెంకటమ్మ, రవీందర్‌నాయక్, సైదులు, మాధవి, ఐఈఆర్‌పీలు ప్రేమ్‌సాగర్, రాందాస్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసమే ఆయుధంలాంటిది

త్రిపురారం : ఆత్మ విశ్వాసమే ఆయుదంలాంటిదని త్రిపురారం ఎంఈఓ రవి నాయక్ అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాదమిక పాఠశాలలో దివ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవి నాయక్ దివ్యాంగుల హక్కులు, అవసరాలు, విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ షేక్ జానీమియా, ప్రధానోపాధ్యాయులు వనజ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ శారద, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఇటికాల రమేష్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే విజయం సాధించొచ్చు



మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

త్రిపురారం : విద్యార్థులు తమకంటు లక్ష్యాలను ఎంచుకొని క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుంటే విజయం సాధించొచ్చని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం షీటీం ఆధ్వర్యంలో నిడమనూరు మండలంలోని టీఎస్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సమయపాలన పాటించకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉత్తమమైన చదువులతోనే గొప్ప వ్యక్తులుగా ఏదుగుతారన్నారు. షీటీం బృందం సభ్యులు మాట్లాడుతూ.. డ్రాగ్స్ వల్ల కలిగే అనార్థాలు, షీటీం మహిళలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది. అత్యవసర సమయంలో డయల్ 100 వల్ల కలిగే ఉపయోగాలు, సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930 యొక్క అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాలియా సీఐ జనార్దన్ గౌడ్, నిడమనూరు ఎస్ఐ గోపాల్ రావు, షీటీం ఎస్ఐ నరేష్, ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ

పెద్దవూర : వంట గది పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎఫ్‌ఎస్‌ఓ యోగేంద్రనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంట చేసే ఏజెన్సీ నిర్వాహకులు మాస్క్, నెత్తికి కొప్పు ధరించి వంటలు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని, ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.7లు, తొమ్మిది, పదితరగతుల విద్యార్థులకు రూ. 9లు ఇస్తున్నట్లు తెలిపారు. ఇకనుంచి నెల వేతనం రూ.3వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వంటల విషయంలో నాణ్యతలో రాజీ పడకుండా తాజా కూరగాయలు, ఆకు కూరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాములు, భూలక్ష్మి, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ : ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ పాటించాలని, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. వంట గదులు, స్టోర్ రూంలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని వార్డెన్లు, సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులు, సమస్యలపై ఆరా తీశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి ఉదయం భోజనం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సంతోష్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి నివాళి

తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సాక్షి,నెట్‌వర్క్



హాలియా : శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



మిర్యాలగూడ టౌన్ : బీసీ భవన్‌లో..



దేవరకొండలో..

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న హిందీ పండిట్ పోస్టుకు అతిథి ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్ఓ ప్రవళిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్‌టీ నర్సింగ్ అతిథి ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి బి.జ్యోత్స్న మంగళవారం తెలిపారు.

మిర్యాలగూడ అర్బన్ : మండల కేంద్రంలోని కేజీబీవీ అవంతీపురంలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్‌టీ నర్సింగ్, పీఈటీ పోస్టులకు గాను అతిథి ఉపాధ్యాయులుగా అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ జి.పార్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంగ్లం సీఆర్‌టీ పోస్టుకు ..

త్రిపురారం : నిడమనూరు మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీగా ఇంగ్లీష్ సీఆర్‌టీ ఉద్యోగానికి అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యూయేట్ బీఈడీ, టెట్ అర్హత ఉండాలన్నారు.

ఆంగ్లం సీఆర్‌టీ పోస్టుకు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని కేజీబీవీలో ఆంగ్లం బోధించుటకు గెస్ట్ టీచర్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ డి. విజయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

చింతపల్లి : మండల పరిధిలోని గడియ గౌరారం గ్రామానికి చెందిన శెట్టిమల్ల విక్రమ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మంగళవారం చింతపల్లి మండల మాల మహానాడు నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కన్వీనర్ జంగయ్య, రాష్ట్ర కన్వీనర్ సంజీవ, ఆంజనేయులు, యాదయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజా పాలన విజయోత్సవాలు



నాగార్జునసాగర్ : మహిళలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ



దేవరకొండ : ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు

నాగార్జునసాగర్ : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నందికొండ మున్సిపాలిటీలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం డ్యాం సీఆర్‌పీఎఫ్ బలగాలు అసిస్టెంట్ కమాండెంట్ షాహీర్ అలీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి సంయుక్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో చెత్తను మున్సిపాలిటీ వాహనాల్లోకి ఎత్తి డంప్ వద్దకు చేర్చారు. అలాగే మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పో టీల్లో పాల్గొని ప్రతిభ కనబరచిన మహిళలకు చైర్‌పర్సన్ అన్నపూర్ణ , కమిషనర్ శ్రీనివాస్‌ల బహుమతులు అందజేశారు. అనంతరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

మెప్మా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

మిర్యాలగూడ టౌన్ : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలను చేశారు. ముందుగా పట్టణంలోని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్‌ఐ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, మెప్మా టీఎంసీ బక్కయ్య, ధనుంజయ, జాఫర్, శ్వేతారెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సైదులు తదితరులున్నారు

దేవరకొండ : ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మంగళవారం దేవరకొండ మున్సిపల్ అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి డిండి చౌరస్తా వరకు మున్సిపల్ అధికారులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ సుదర్శన్ మాట్లాడుతూ పట్టణంలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. చెత్తను రోడ్లపై పడవేయకుండా చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లో మాత్రమే తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

త్రిపురారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రాగడపలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగడప గ్రామానికి చెందిన రైతు పొట్టిపాక సైదయ్య వ్యవసాయంతో పాటుగా గేదెలను సాకుతున్నారు. గ్రామంలో వరి కోతలు కోయడంతో రోజు మాదిరిగానే గేదెలను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు తోలుకెళ్లారు. గేదెలు మేత మేసుకుంటూ పొలాలకు సమీపంలో ఉన్న తుంగపాడు బొందం వద్దకు వెళ్లింది. బొందానికి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికే విద్యుత్ మోటా ర్‌కు ఏర్పాటు చేసుకున్న కరెంటు తీగ తెగి ఉండడంతో విద్యుత్ సరఫరా అవుతుండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ సుమారు రూ. 85 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.